



# అమ్మ కల నెరవేరిన క్షణం

## తిరుపతి జిల్లా కలెక్టర్‌గా తల్లిదండ్రుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా



"శ్రీవారి ఆశీస్సులతో, తల్లిదండ్రుల, గురువుల, పెద్దల ఆశీర్వాదాలతో బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు సంతోషంగా ఉంది. తిరుపతి చారిత్రాత్మక జిల్లా. ఆధ్యాత్మికంగానూ, మతపరంగానూ, అభివృద్ధిపరంగానూ రాష్ట్రంలో ప్రముఖమైనది. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సహకారంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ తిరుపతిని ఉత్తమ జిల్లాగా నిలబెట్టడానికి కృషి చేస్తా.ఏ ఐఏఎస్ అధికారి కెరీర్‌లో అయినా ఎన్నికల్లో పనిచేయడమనేది అతి ముఖ్యమైన సందర్భం. ఈ అవకాశాన్ని ఛాలెంజిగా స్వీకరిస్తున్నాను. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల అధికారుల మార్గదర్శకాలను, ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తా. జిల్లా నలుమూలలా ఏం జరుగుతోందో తెలుసుకోవడం నా ఒక్కడివల్లే సాధ్యం కాదు. మీడియానే కళ్ళూ, చెవులుగా పరిగణిస్తాను."

అమ్మ కల నెరవేరిన ఆ క్షణం.. అపురూపమైనది. ఆనందం అర్ణవమై.. ఆ తల్లి కనుకొలకుల్లో నీళ్ల తొణికిసలాడిన ఆ దృశ్యం.. జిల్లా కలెక్టరేట్‌లో అందరి మనసులనూ తడి చేసింది. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేయగానే లక్ష్మీశాను ఆయన తల్లి లక్ష్మమ్మ హత్తుకుని, అల్లుకుని మాటలు పెగలని ఆనందం ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లాలో మారుమూలన ఉండే హోలుగుండనపల్లెలో నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టి పెరిగిన లక్ష్మీశా 2013లో ఐఏఎస్ సాధించినా జిల్లా కలెక్టర్‌గా ఇది ఆయన తొలి పోస్టింగ్. కర్నూలు జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా ప్రొబేషన్ పూర్తి చేసుకున్న ఆయన నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత పార్వతీపురం ఐటీడీఏ పీవోగా, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అటు తర్వాత ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమితులయ్యారు. ఎన్ని బాధ్యతలు నిర్వహించినా ఐఏఎస్ సాధించినవారి జీవితంలో కలెక్టర్ హోదా అన్నది ప్రత్యేకమైనది. పేద తల్లిదండ్రులు ఎదురుచూసిన ఈ ప్రత్యేక సందర్భాన్ని లక్ష్మీశా తన కుటుంబం మొత్తంతో కలిసి బుధవారం సంతోషంగా పంచుకున్నారు. ఎన్నికల వేళ హఠాత్తుగా ఆయనను తిరుపతి కలెక్టర్‌గా బదిలీ చేశారు.కుటుంబసభ్యులందరితో కలిసి తిరుమల వెళ్లి బుధవారం వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాత సేవలో పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు.తర్వాత కలెక్టరేట్‌కు చేరుకుని తిరుపతి జిల్లా రెండవ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, డీఆర్వో పెంచల కిషోర్, డీపీవో బాలకొండయ్య, వివిధ శాఖల అధికారులు, లక్ష్మీశాకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కుటుంబంతో కలెక్టర్ లక్ష్మీశా

### విజయవాడ వెళ్ళిన కలెక్టర్

కాగా బుధవారం జిల్లా పాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ లక్ష్మీశా అనంతరం కలెక్టర్ విజయవాడకు బయల్దేరి వెళ్ళారు. గురువారం అక్కడే వుంటారు.శుక్రవారం నుంచీ జిల్లాలో అధికార యంత్రాంగానికి, ప్రజలకు అందుబాటులో వుంటారు.



బాధ్యతల స్వీకరణ

### అమ్మ మనసు ఉప్పొంగిన వేళ..

జిల్లా నూతన కలెక్టర్‌గా లక్ష్మీశా బాధ్యతలు చేపట్టి, అధికారుల నుంచీ అభినందనలు, శుభాకాంక్షలు స్వీకరించిన అనంతరం ఓ సాదాసీదా పల్లెటూరి తరహా వృద్ధ దంపతులు ఆయన్ను సమీపించారు. వారిలో వృద్ధ మహిళ ఒక్కసారిగా ఆయన్ను హత్తుకుపోయారు. చూస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులు అయోమయానికి గురయ్యారు. అర్జీ ఇచ్చేందుకు వచ్చిన వృద్ధురాలు కలెక్టర్‌ను ఆప్యాయంగా కలిసి ఆలింగనం చేసుకున్నట్టుగా అందరూ భావించారు. అయితే కలెక్టర్ ఆమెను తన తల్లి లక్ష్మమ్మగా అక్కడున్న అందరికీ పరిచయం చేశారు. దూరంగా నిలుచున్న తండ్రిని, భార్యను, ఇద్దరు పిల్లలను, సోదరుని, అత్తామామలను కూడా పిలిచి పక్కన నుంచోబెట్టుకున్నారు. వారందరినీ కూడా అధికారులకు, మీడియా ప్రతినిధులకు పరిచయం చేశారు.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

# ఆదిమూలం దెబ్బ

## ● గురుమూర్తి రీబ్యాక్ ● రాజేష్‌కు సత్యవేడు ఛాన్సు



గురుమూర్తి



రాజేష్

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొట్టిన దెబ్బకు అధికార పార్టీ ఇంఛార్జుల జాబితా తారుమారైంది. బుధవారం ఆ పార్టీ విడుదల చేసిన ఐదవ జాబితాలో దాని ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఇంఛార్జిగా స్థానిక ఎంపీ గురుమూర్తిని ప్రకటించిన అధిష్ఠానం సత్యవేడుకు నూకతోటి రాజేష్‌ను ఇంఛార్జిగా నియమించింది. రాజేష్ మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సోదరి కుమారుడు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా తిరుపతి లోక్‌సభ స్థానానికి ఇంఛార్జిగా నియమిస్తూ గత 7వ తేదీన నాలుగో జాబితాలో అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలోనే సత్యవేడు ఇంఛార్జిగా తిరుపతి ఎంపీ గురుమూర్తిని ప్రకటించింది. ఆ జాబితా కారణంగా జిల్లా వైసీపీలో ముసలం పుట్టినట్టయింది.తిరుపతి ఎంపీగా పోటీ చేయడానికి ఇష్టపడని ఆదిమూలం ఆ విషయం అధినేతకు, మంత్రి పెద్దిరెడ్డికి పదేపదే చెప్పుకున్నా ఫలితం లేకపోయింది. నియోజకవర్గ వైసీపీలో వ్యతిరేక వర్గం ముందు తలెత్తకోలేని పరిస్థితులు ఏర్పడడంతో ఎంపీ టికెట్ కంటే ఆత్మాభిమానమే ముఖ్యమని భావించిన ఆదిమూలం ఎంపీ టికెట్ తనకు వద్దని, అంతకు మించి దళితులకు గౌరవం ఇవ్వని పార్టీయే తనకు అవసరం లేదని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఆయన టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. ఈ పరిణామాలతో వైసీపీ అధిష్ఠానం షాక్‌కు గురైంది. తాజా జాబితాలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ ఇంఛార్జిగా తప్పించి తిరిగి తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా ప్రకటించారు. ఖాళీగా వున్న సత్యవేడుకు నూకతోటి రాజేష్‌ను నియమించారు. రాజేష్ మంత్రి పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడు. జీడీనెల్లూరులో అవకాశం కల్పించాలని ఎంత ప్రయత్నించినా సమీకరణల కారణంగా వీలు కాలేదు. జీడీనెల్లూరు నుంచీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని తప్పించి అక్కడ రాజేష్‌ను ఇంఛార్జిగా నియమించాలన్న ప్రయత్నాలు బలంగా జరిగాయి. అయితే నారాయణస్వామి అధినేత ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో మనసు మార్చుకున్న అధినేత చిత్తూరులో ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా వేశారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను అనివార్యంగా జీడీనెల్లూరు అసెంబ్లీకి బదిలీ చేయాల్సి వచ్చింది. దీంతో రాజేష్‌కు అవకాశం కల్పించలేకపోయారు. అయితే ఆదిమూలం పార్టీని వీడడంతో అనూహ్యంగా రాజేష్‌కు అవకాశం దక్కింది. గెలుపోటముల సంగతి పక్కనపెడితే ఈ దఫా టికెట్ దక్కదని తీర్మానించుకున్న రాజేష్‌కు అదృష్టం తలుపు తట్టింది. మరోవైపు తిరుపతి నుంచీ సత్యవేడుకు, మళ్ళీ సత్యవేడు నుంచీ తిరుపతికి బంతిలా అటూఇటూ దొర్లిన గురుమూర్తి సైతం తీవ్ర ఆవేదనతో వున్నట్టు సమాచారం. మొత్తానికి కోనేటి ఆదిమూలం తీసుకున్న నిర్ణయం వైసీపీలో అనేక మార్పుచేర్పులకు కారణమవుతోంది.

### చెవిరెడ్డికి వైసీపీలో మరిన్ని బాధ్యతలు



చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి తాజాగా వైసీపీలో మరిన్ని అదనపు బాధ్యతలు మీద పడ్డాయి. ఇప్పటికే పార్టీ అనుబంధ విభాగాల ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న ఆయన కొంతకాలంగా పూర్తి సమయం పార్టీ అధినేత జగన్‌కు అందుబాటులో వుంటూ పార్టీ సర్వేల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనను ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నియామకంతో ఒంగోలు ఎంపీ టికెట్ ఆయనకే కేటాయించే అవకాశముందని జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. అనూహ్య పరిణామాలు ఎదురైతే తప్ప ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ఆయనే బరిలోకి దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31: జిల్లాలో పని చేస్తున్న పలువురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు.ఇతర జిల్లాల నుంచీ కొంతమంది బదిలీపై మన జిల్లాకు రానున్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా నియమించారు. కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ భవాని శంకరిని నూజివీడు ఆర్డీవోగా, వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులును తెలుగుగంగ ప్రాజెక్టు నెల్లూరుజిల్లా రాపూరుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న దేవేంద్రరెడ్డిని జిల్లా వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. నగరి ఆర్డీవో సుజనను తుడా భూసేకరణ అధికారిగా నియమించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన రామ్మోహన్‌ను తిరుపతి జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. వరదయ్యపాళెం తహసీల్దారుగా పనిచేస్తున్న గౌరీశంకరరావు పదోన్నతిపై అనంతపురం, హిందుపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

వై.ఉదయభారతి, బి.లక్ష్మీదేవి, బి.శ్రీధర్ రావు, అన్నమయ్య జిల్లా నుంచీ ఎం.శ్రీరాములు నాయక్, మహబూబ్ చాంద్, చిత్తూరు జిల్లా నుంచీ నరసింహులు,గుంటూరు జిల్లా నుంచీ కె.సాంబశివరావు, జి.నాంచారయ్య, కె.శ్రీనివాస శర్మ, కె.కళ్యాణి, జి.కరుణకుమార్, బీవీఆర్ సీహెచ్ ప్రసాద్, కె.పుల్లారావు, జి.శ్రీనివాస్, డి.నాగరాజరావు బదిలీపై మన జిల్లాకు రానున్నారు.

## ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎల్ఎన్ రెడ్డి బదిలీ

- తిరుపతికి రానున్న ఆరుగురు సీఐలు
- ఇద్దరు సీఐలు రెగ్యులర్ ప్రాతిపదికన ప్రస్తుత స్థానాల్లోనే

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: తిరుపతి జిల్లా ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎల్ఎన్ రెడ్డి బదిలీ అయ్యారు. అలాగే నూతనంగా ఆరుగురు సీఐలు బదిలీపై తిరుపతికి రానున్నారు. మరో ఇద్దరు సీఐలు ప్రస్తుతమున్న స్థానాల్లోనే రెగ్యులర్ ప్రాతిపదికన కొనసాగనున్నారు. ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎల్ఎన్ రెడ్డి అనంతపురం ఏఆర్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. ఇక ఇప్పటికే అనంతపురం రేంజిలో వీఆర్‌లో ఉన్న సీఐలు శ్రీరాముడును తిరుపతి ట్రాఫిక్ సీఐగా నియమించారు. జి. విజయ్‌కుమార్‌ను తిరుమల వన్‌టౌన్ సీఐగా, బి. శ్రీకాంత్‌రెడ్డిని తిరుచానూరు సీఐగా బదిలీ చేశారు. తమీమ్ అహ్మద్‌ను తిరుపతి రూరల్ సీఐగా, ఎం. రామయ్యను చంద్రగిరి సీఐగా, జి. మురళీకృష్ణను తిరుపతి సీసీఎస్ సీఐగా నియమించారు.ప్రస్తుతం తాత్కాలికంగా శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా పని చేస్తున్న ఎస్వీ నరసింహారావును అదేస్థానంలో రెగ్యులర్ ప్రాతిపదికన నియమించారు. పుత్తూరు సీఐ జి. ఓబులేసును కూడా అదే స్థానంలో రెగ్యులర్ ప్రాతిపదికన కొనసాగిస్తూ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

# పలువురు తహసిల్దార్లకు స్థానచలనం

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్ళు పైబడి జిల్లాలో కొనసాగుతున్న తహసిల్దార్లను బదిలీ చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా 36మంది తహసిల్దార్లు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు.అదే సమయంలో ఇతర జిల్లాల నుంచీ ఇక్కడికి 32 మంది బదిలీపై రానున్నారు. కాగా జిల్లాలో మూడేళ్ళ సర్వీసు పూర్తి కాని వారు, అలాగే మరో ఆరు నెలల్లో రిటైరు కానున్న వారు కలిపి ఐదుగురు తహసిల్దార్లకు బదిలీల నుంచీ ఈసీ మినహాయింపు ఇచ్చింది. బయటి జిల్లాల నుంచీ వచ్చే తహసిల్దార్లకు చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల పరిధిలో చిత్తూరు కలెక్టర్, వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో నెల్లూరు కలెక్టర్ మండలాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ కసరత్తు పూర్తి కానుంది.

### జిల్లానుంచీ 36 మంది బదిలీ

కె.కుప్పయ్య (కలెక్టరేట్‌లో ప్రోటోకాల్ సెక్షన్), పి.భారతి (కలెక్టరేట్), వీఎన్‌వీఆర్ కృష్ణ (డక్కిలి), ఎం.రోశయ్య (నాయుడుపేట),ఎస్.శివప్రసాద్ (ఏర్పేడు), యు.మధుసూదన రావు (పిచ్చాటూరు), ప్రమీల (నారాయణవనం), వెంకట్రమణ, (తిరుపతి అర్బన్), శిరీష (చంద్రగిరి), కేపీ భాగ్యలక్ష్మి (పాకాల), ఐ.సుబ్రమణ్యం (వడమాలపేట), వై.రమేష్‌బాబు, ఆర్.వెంకటలక్ష్మమ్మ (ఎండోమెంట్స్, తిరుపతి) కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఝాన్సీలక్ష్మి, (ఆర్డీవో కార్యాలయ ఏవో, శ్రీకాళహస్తి), వి.ఉదయ్ సంతోష్ (రేణిగుంట) కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎం.హనుమంతు నాయక్ (బాలాయపల్లి), జె.నిత్యానందబాబు (తొట్టంబేడు), సి.శ్రీదేవి (కేవీబీపురం), టీవీ సుబ్రమణ్యం (తిరుపతి రూరల్), జె.పరమేశ్వరస్వామి (పుత్తూరు), దస్తగిరయ్య (ఎర్రావారిపాలెం), లోకేశ్వరి (చిన్నగొట్టిగల్లు) అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్ళారు. ఎం.భార్గవి (బీఎన్ కండ్రిగ), జీసీ వెంకటేశ్వర్లు (ఆర్‌సీపురం) నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. బి.లీలారాణి (గూడూరు),ఎ.పద్మావతి (కోట), బి.పద్మావతి (వెంకటగిరి), రామకృష్ణ శివప్రసాద్ (దొరవారిసత్రం), రవికుమార్ (సూళ్ళూరుపేట), రామయ్య (పెళ్ళకూరు), ఎస్.చంద్రశేఖర్ (కలెక్టరేట్) ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. షేక్ జరీనా (సత్యవేడు) అన్నమయ్య జిల్లాకు, మునిలక్ష్మి (చిల్లకూరు) బాపట్ల జిల్లాకు, గీతావాణి (సూళ్ళూరుపేట ఆర్డీవో ఆఫీసు ఏవో) పల్నాడు జిల్లాకు బదిలీ కాగా మస్తానయ్య (చిట్టమూరు), జయజయరావు (తడ)లను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు.

### బయటి నుంచీ 32మంది రాక

అనంతపురం జిల్లా నుంచీ ఉషారాణి, ఎం.బాలకృష్ణ, జి.మారుతి, బి.వాణిశ్రీ బదిలీపై జిల్లాకు రానున్నారు.నంద్యాల జిల్లా నుంచీ కె.నరసింహారావు, కర్నూలు జిల్లా నుంచీ కె.శ్రీనివాస గౌడ్, డి.హుస్సేన్ సాహెబ్, కె.రామంజనేయులు, కడప జిల్లా నుంచీ పి.శరత్, ఎం.శ్రీవాణి, వి.గంగయ్య, ఎ.నాగేశ్వరరావు, వి.రాజసింహ నరేంద్ర, పీఎండీ అలీఖాన్, డి.ఉదయ భాస్కర రాజు, శంకర్ రావు, ఏవీఎస్ నారాయణరెడ్డి,

### ఐదుగురికి బదిలీల నుంచీ మినహాయింపు

జిల్లాలో మూడేళ్ళ సర్వీసు పూర్తికాని కారణంగా తిరుపతి కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్లు కె.జనార్దన రాజు, కేవీఆర్వీ ప్రసాదరావు, శ్రీకాళహస్తి తహసిల్దారు ఎస్.ద్వారకనాథరెడ్డి, వాకాడు తహసిల్దారు నరసింహారావు, జూన్‌లోపు రిటైరు కానున్న నాగలాపురం తహసిల్దారు ఎ.ప్రసన్న కుమార్‌కు బదిలీల నుంచీ ఎన్నికల కమిషన్ మినహాయింపు ఇచ్చింది.

# తిరుమల ఘాట్‌లో ఎలుగుబంటి హల్‌చల్



తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసి భక్తులను భయపెట్టింది. అలిపిరి సమీపంలోని మొదటి మలుపు వద్ద రోడ్డు సమీపానికి ఎలుగుబంటి రావడం యాత్రికులను భయభ్రాంతులకు గురిచేసింది. కొంతసమయం రోడ్డుకు దగ్గరదగ్గరగా ఎలుగుబంటి సంచరించింది. దాదాపు 20 నిమిషాల తర్వాత వాహనాల శబ్దాలను గమనించి ఎలుగుబంటి అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది.

## తిరుచ్చిపై సూర్యనారాయణస్వామి సాక్షాత్కారం



తిరుచానూరు, జనవరి 31: తిరుచానూరులో కొలువైన సూర్యనారాయణస్వామికి బుధవారం వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మ నక్షత్రం హస్త పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సూర్యనారాయణస్వామి తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



భాకరాపేట, జనవరి 31: చిన్నగొట్టిగల్లులో రూ.7.29 కోట్లతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని బుధవారం 'తుడా' చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సహదేవరెడ్డి, జడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు శ్రీధర్ రెడ్డి, షీలాబాను, సర్పంచ్ మనోహర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసరా చెక్కుల పంపిణీ

భాకరాపేట, జనవరి 31: చిన్నగొట్టిగల్లులో బుధవారం 'తుడా' చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో 633 గ్రూపులకుగాను రూ.5.55 కోట్లు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సహదేవరెడ్డి, జడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, ఏపీఎం కుమారస్వామి పాల్గొన్నారు.

## భాకరాపేట ఘాట్‌లో కారు బోల్తా

భాకరాపేట, జనవరి 31: భాకరాపేట ఘాట్ రోడ్డులో తిరుపతి నుంచి కేవీ పల్లె మండలం నూతనకాల్వకు వెళ్తున్న రెడ్డప్ప రెడ్డి, రమణమ్మ దంపతుల కారు బుధవారం బోల్తాపడింది. ఈ ఘటనలో వారిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి.

## ఇంటికి నిప్పు: ముగ్గురికి గాయాలు



108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు

పాకాల, జనవరి 31: గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి నిప్పుపెట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కేశవనగర్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. కేశవనగర్‌లో నివసిస్తున్న జ్యోతిప్రసాద్, ఆయన భార్య పార్వతీ సమీప బంధువు మహేష్ ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు.ఒక్కసారిగా మంటలు రావడం చూసి గట్టిగా కేకలు వేయడంతో పొరుగున వున్నవారు తలుపులు బద్దలు కొట్టి నీళ్లుపోసి మంటలను అదుపు చేశారు. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పాకాల ఎస్ఐ మహేష్ బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీ, జనసేన నేతల పర్యటన



దామలచెరువులో టీడీపీ నాయకులు

పాకాల, జనవరి 31: మండలంలోని దామలచెరువులో బుధవారం మీ ఇంటివద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి మినీ మ్యానిఫెస్టో గురించి వివరించారు. తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానీని గెలిపించాలని కోరారు.

## జ్ఞానవాపిలో పూజలను స్వాగతిస్తున్నాం

తిరుపతి(విద్య), జనవరి 31: కాశీలోని విశ్వనాథుని మందిరంలో(జ్ఞానవాపి మసీదు)పూజలకు అనుకూలంగా వారణాసి కోర్టు తీర్పు వెలువరించడాన్ని స్వాగతిస్తున్నామని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల పేర్కొన్నారు. జ్ఞానవాపిలో గతంలో ఉన్న హిందూ ఆలయాన్ని కూల్చి ఆ శిథిలాలపై మసీదును నిర్మించారని భారత పురావస్తు విభాగం(ఏఎస్ఐ) శాస్త్రీయ పరిశోధనల నివేదిక ఆధారంగా కోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. ఈ తీర్పును విశ్వనాథుని మందిర్ ట్రస్ట్ స్వాగతిస్తూ వారం రోజులలో పూజలు ప్రారంభిస్తామని పేర్కొనడం సంతోషంగా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉద్యోగులను నిరుత్సాహపరచిన కేబినెట్ నిర్ణయాలు



దేవానంద్

తిరుపతి(విద్య),జనవరి 31: ఏపీ కేబినెట్ సమావేశంలో బుధవారం చేపట్టిన నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర నిరుత్సాహానికి గురిచేశాయని సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రేగంటి దేవానంద్ వాపోయారు. ఎంతో ఆశగా ఎదురుచూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యంకాని నిర్ణయాలు తీసుకుని నిరాశపరచారని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన అరియర్స్, డీఏల ప్రస్తావనలేకపోవడం బాధించిందని, అలాగే 2003 టీచర్లకు కేంద్రప్రభుత్వ జీవో ప్రకారం పాతపెన్షన్ నిర్ణయం తీసుకుంటారని ఎదురుచూసిన 7వేలమంది టీచర్ల ఆశలు అడియాశలు అయ్యాయని విమర్శించారు. ఐఆర్ ప్రకటన లేకుండానే ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని డీఎస్సీ-2024, అటవీశాఖలో ఉద్యోగాల పోస్టులకు ఆమోదించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వర్సిటీలలో బోధనేతర ఉద్యోగులకు 60నుంచి 62ఏళ్లకు పెంపు నిర్ణయం నిరుద్యోగుల అవకాశాలను గండి కొట్టడమే అవుతుందని ఆరోపించారు. ఈ నిర్ణయాలు ఉద్యోగులకు ఏమాత్రమూ ఉపయోగపడని విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

## టీడీపీ సమీకృత శిక్షణ



తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా పరిశీలన మొదలుకుని పోలింగ్ రోజున నిర్వహించాల్సిన బాధ్యతల వరకు బుధవారం తిరుపతిలోని టీడీపీ కార్యాలయంలో సమీకృత శిక్షణ (ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్) కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని 12 క్లస్టర్లకు సంబంధించి ఇన్‌చార్జులు, వార్డు నాయకులు, బూత్ ఇన్‌చార్జులు, సాధికార సభ్యులు పాల్గొన్నారు. రెండు, మూడు రోజుల్లో ఓటరు పరిశీలన పూర్తిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. 80 ఏళ్లకు పైబడిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉందని, బూత్ ఇన్‌చార్జులు ఆ ఓటర్లకు తెలియజేయాలని చెప్పారు. అభ్యంతరాలు గుర్తించిన వెంటనే నియోజకవర్గ ఈర్వోకి లెటర్ పెడుతూ పార్టీ కేంద్ర కార్యాలయానికి నకలు పంపాలని తెలిపారు.





టీడీపీ బీసీ గర్జన సమావేశంలో మాట్లాడుతున్న నాని

# టీడీపీతోనే బీసీల్లో చైతన్యం

ఎర్రావారిపాలెం, జనవరి31: తెలుగుదేశం పార్టీతోనే బీసీల్లో చైతన్యం వచ్చిందని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని అన్నారు. బుధవారం ఎర్రావారిపాలెంలో జరిగిన టీడీపీ బీసీ గర్జన మహా సభలో ఆయన మాట్లాడుతూ తమ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు.అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా విధులు నిర్వర్తించాలన్నారు. తాను గెలుపొందితే కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడబోనన్నారు. కార్యకర్తలను తాను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వైసీపీ బెదిరింపులకు ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పాల ఏకిరి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సీఎం జగన్ అధోగతి పాలు చేశాడన్నారు. వడ్డెర సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకట్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలన్నారు.టీడీపీ నాయకుడు అన్నా సముద్రం మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షులు రఘునాథ, మురళి, ప్రధాన కార్యదర్శులు మహేష్ నాయుడు, మదన్ మోహన్, కేశవులు నాయుడు, మద్దూరు దేవి, లక్ష్మీదేవి, రఘునాథ, సుధాకర్ నాయక్, మురళి, హరిశ్చంద్ర, బుజ్జిబాబు,శివమణి, సుబ్రమణ్యం, అమరనాథరెడ్డి, శేషు, విశ్వనాథ రెడ్డి, వెంకట శివరామిరెడ్డి, జనసేన నాయకులు దేవర మనోహర్, కల్పా రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో ఏనుగుల బీభత్సం





చంద్రగిరి, జనవరి31: మండలంలోని భీమవరం, మామిడిమానుగడ్డ, చిన్నరామాపురం గ్రామాల సమీప పంట పొలాలపై మంగళవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. సమాచారం అందుకున్న డీఆర్వో చినబాబు, సిబ్బంది ఆ గ్రామాలకు చేరుకుని రైతుల సహకారంతో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా బాణసంచా సంచి కాల్చి తరిమారు. బుధవారం ఉదయం అటవీ అధికారులు ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను పరిశీలించారు. ఇందులో మామిడిమానుగడ్డకు చెందిన చిన్నంగారి దేశమ్మకు చెందిన ఎకరా వరి, 20 అరటి చెట్లు, ఆదిలక్ష్మికి చెందిన వరి, 20 అరటి చెట్లు, చిన్నరామాపురం హరిజనవాడకు చెందిన గురుమూర్తి పొలంలోని వరి, చిన్నరామాపురానికి చెందిన రామచంద్రారెడ్డికి చెందిన వరి, నారు మడి, మోహన్‌రెడ్డికి చెందిన 80 సెంట్లు వరి, సాగు నీటి పైపులు, భీమవరానికి చెందిన మునిరత్నంనాయుడి అర ఎకరాలోని గడ్డి, పెండ్యాల సుభాకర్‌నాయుడుకు చెందిన వంద అరటి చెట్లు, ఐదు మామిడి చెట్లు, భూపాల్‌నాయుడుకు చెందిన వంద అరటి, 5 మామిడి చెట్లను ధ్వంసం చేసాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. డీఆర్వో చినబాబు మాట్లాడుతూ 20 రోజులుగా ఏనుగులు భాకరాపేట, యల్లంపల్లి అడవుల్లో తిష్ట వేశాయని, దీంతో రైతులు ఒంటరిగా రాత్రుల్లో పంట పొలాల వద్దకు వెళ్ళరాదని సూచించారు. యల్లంపల్లి అడవుల్లో సుమారు 15 ఏనుగులున్నాయని, అందులో నాలుగు పిల్ల ఏనుగులు ఉన్నట్లు గుర్తించామన్నారు.

# సదరంలో బాధితులకు తప్పని తిప్పలు

- గంటల తరబడి వికలాంగులు, వయోవృద్ధుల పడిగాపులు



సదరం కార్యాలయం ముందు అవస్థలు పడుతున్న బాధితులు

తిరుపతి సిటీ, జనవరి 31 : శారీరక, మానసిక వికలాంగులు, పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ప్రభుత్వం నుంచి పింఛను పొందాలంటే సదరంలో ధ్రువీకరించిన సర్టిఫికెట్ తప్పనిసరి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఇప్పటి వరకు రుయాస్పత్రిలోనే సదరం క్యాంపు నిర్వహించి, బాధితులను వైద్యులు పరీక్షించి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. బుధవారం నిర్వహించిన సదరం క్యాంపులో బాధితులకు తిప్పలు తప్పలేదు. బాధితులకు అనుకూలమైన గది, వసతులను కల్పించకపోవడంతో కార్యాలయ భవనంలో ఉన్న చిన్నపాటి సదరం కార్యాలయం ముందే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో నేల పైనే కూర్చోవాల్సి వచ్చింది. తాగేందుకు నీటి సౌకర్యం లేదు. నడవలేని స్థితిలో ఉన్న వారిని లోపలకు తీసుకువచ్చేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో బాధితుల సహాయకులే అవస్థలు పడాల్సి వచ్చింది. సదరం క్యాంపు నిర్వహించిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంటున్నా అధికారులు ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

## జిల్లా ప్రగతిలో అధికారుల భాగస్వామ్యం మరువలేనిది

- వీడ్కోలు సభలో వెంకటరమణారెడ్డి



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31 : తిరుపతి జిల్లాలో మొదటి కలెక్టర్‌గా అవకాశం రావడం సంతోషంగా ఉందని, జిల్లాలో అధికారులు ఎంతో సమన్వయంతో పనిచేసి సహకరించారని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ అయిన వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం తుడా కార్యాలయం సమీపంలోని కచ్చపి ఆడిటోరియంలో వెంకటరమణారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జేసీ బన్సల్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఆర్వో పెంచలకిషోర్, డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి, బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ, జిల్లా అభివృద్ధి చేసిన సంతృప్తి ఉందన్నారు. తిరుపతి వంటి జిల్లాలో ప్రముఖుల పర్యటనలు, ప్రొటోకాల్‌తో పాటు అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేయడం ఎంతో కష్టతరమని, అధికారుల సహకారంతోనే బాధ్యతలను సరిగా చేయగలిగానని చెప్పారు. జేసీ, ఎస్పీ, డీఆర్వో మాట్లాడుతూ కొత్త జిల్లాగా ఏర్పడిన సమయంలో వెంకటరమణారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి పాలనాదక్షతతో సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. అనంతరం కలెక్టర్ వెంటరమణారెడ్డి దంపతులను సన్మానించారు.

# పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### ఆర్డీవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకుల నిరసన





ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

తిరుపతి(విద్య), జనవరి 31 : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి పేర్కొన్నారు. సంఘ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా పీఎఫ్ నిధులు ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాల్లో జమకాలేదని, కనీసం ఎంత నగదు ఉందో తెలుసుకునేందుకు పీఎఫ్ స్లిపులు కూడా ఆన్‌లైన్‌లో కనిపించడంలేదని వాపోయారు. రెండేళ్లుగా సరెండర్ లీవులు, పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెడికల్ బిల్లుల చెల్లింపులు జరగలేదని, ఈ విషయమై రెండు నెలలుగా ఉద్యోగులు కోరుతున్నా ఆర్థిక బకాయిలు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. 12వ వేతన సంఘం నియమించిన సందర్భంగా 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, కోశాధికారి రమేష్‌నాయుడు, డివిజన్ కన్వీనర్ బండి మధుసూదన్‌రెడ్డి, నాయకులు దండు రామచంద్రయ్య, సురేష్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మానందానికి సైకత శుభాకాంక్షలు





చిల్లకూరు, జనవరి 31: సినీనటుడు బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా బుధవారం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ గ్రామ సమీపంలోని సముద్రతీర ప్రాంతంలో బ్రహ్మానందం సైకతశిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ హాస్యనటుడిగా ఐదు నంది అవార్డులు, ఒక ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్న ఆయనకు సైకతశిల్పం ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.

### తిరుపతిలో అలహాబాద్‌కు చెందిన

## బస్సు డ్రైవర్ దారుణ హత్య

- క్లీనర్ నిరంజన్‌ను అనుమానిస్తున్న పోలీసులు



బస్సు డ్రైవర్ చంద్రసేన్ తివారి మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ తిరుపతిలో హత్యకు గురయ్యారు. బస్సు క్లీనర్ అదృశ్యం కావడంతో అతడే హత్యకు పాల్పడి వుంటాడని పోలీసులు భావిస్తున్నారు. అలహాబాద్‌కు చెందిన 55మంది యాత్రికులు తీర్థయాత్రకు తమ ప్రాంతానికే చెందిన ఓ ప్రైవేటు బస్సును అద్దెకు కుదుర్చుకున్నారు.చంద్రసేన్ తివారి (52) బస్సు డ్రైవర్ కాగా, నిరంజన్ క్లీనర్ (25). ఒడిశా రాష్ట్రంలో పర్యటన ముగించుకున్న యాత్రికులు మంగళవారం సాయంత్రానికి తిరుపతికి చేరుకున్నారు. యాత్రికులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లగా... పాత తిరుచానూరు రోడ్డులోని ప్రైవేటు బస్సుల పార్కింగ్ ప్రదేశంలో బస్సును పార్క్ చేసుకుని డ్రైవర్ చంద్రసేన్ తివారి, క్లీనర్ నిరంజన్ తిరుపతిలోనే ఉండిపోయారు. శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుంచి వచ్చిన యాత్రికులు చంద్రసేన్ తివారి హత్య విషయాన్ని గుర్తించారు. తల, ముఖంపై తీవ్రమైన గాయాలతో బస్సు సీటులో పడుకున్నవాడు పడుకున్నట్టే మృతి చెంది ఉండటాన్ని గుర్తించి స్థానికుల సాయంతో ఈస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.భక్తులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు, బస్సు యజమానికి సమాచారం తెలియజేశారు.క్లీనర్ నిరంజన్ కనిపించకపోగా అతడి సెల్‌ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ చేసి ఉండటంతో అతడే హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి తల, ముఖంపై ఉన్న బలమైన గాయాలను బట్టి జాకీరాడ్ లేదా మరేదైనా ఇనుప కడ్డీతో బలంగా కొట్టి హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లీనరే హత్య చేశాడా లేక మరెవరైనా చేశారా.. హత్యకు కారణమేంటి అనే విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి చెప్పారు.



విజయసింహారెడ్డి దంపతులకు సన్మానం

## విజయసింహారెడ్డి సేవలు మరువలేనివి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31: సమాచార శాఖలో విజయసింహారెడ్డి సేవలు మరువలేనివని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య అన్నారు. తిరుపతిలో డీపీఆర్వోగా పనిచేస్తున్న విజయసింహారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కలెక్టరేట్‌లోని పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో సన్మానించారు. బాలకొండయ్య మాట్లాడుతూ విజయసింహారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని సమాచార శాఖ అధికారులు, సిబ్బంది పనిచేయాలని కోరారు. 33 సంవత్సరాలుగా సమాచారశాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన విజయసింహారెడ్డి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్లు చెంగల్‌రెడ్డి, జయలక్ష్మి, డీపీఆర్వో పురుషోత్తం, వెంకటరమణ పాల్గొన్నారు.

# ఎన్నికల కోసమే డీఎస్సీ డ్రామా

### తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31: ఎన్నికలు సమీపిస్తున్నందునే వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ డ్రామాకు తెరలేపిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ గురించి పట్టించుకోని ప్రభుత్వం ఎన్నికలకు రెండు నెలల ముందు నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగులను ఊరిస్తోందన్నారు. ఏటా డీఎస్సీ అని చెప్పి జగన్ అబద్దాలు, మోసం, వంచనకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రం చెప్పగా, ప్రస్తుతం 6 వేల పోస్టుల భర్తీ అని చెప్పడం దారుణమన్నారు. 2014-19 నడుమ రెండు మెగా డీఎస్సీలు నిర్వహించిన 16,790 మందికి ఉపాధ్యాయులుగా చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. మరో మూడు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుండగా, వైసీపీ ప్రభుత్వం చేస్తున్న హడావుడినని అర్థం చేసుకోలేనంతగా నిరుద్యోగులు అమాయకులా అని ప్రశ్నించారు. వైసీపీ ఎన్నికల గిమ్మిక్కులను నిరుద్యోగులు ఓటు ద్వారా తిప్పికొట్టాలని ఆనంద్‌గౌడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల పనులు త్వరగా చేయండి

### ఉద్యోగులకు ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి సూచన



తనిఖీ చేస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31: వివిధ పనులపై వచ్చే విద్యార్థులకు త్వరగా చక్కబెట్టి పంపాలని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఉద్యోగులకు సూచించారు. యూనివర్సిటీలోని ఎగ్జామ్స్, అకడమిక్, ఫైనాన్స్, డెవలప్‌మెంట్ సెక్షన్లను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పటికి ఇంకా విధులకు హాజరుకాని ఉద్యోగులను గుర్తించారు. సమయానికి విధులకు హాజరు కాని వారికి గైర్హాజరు వేశారు. అన్ని విభాగాల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ఇందుకు ఆయా విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పనులపై వచ్చే విద్యార్థులకు సహకరించి, స్నేహ భావంతో త్వరితగతిన పనులు చేయాలని కోరారు. సీఈ దామ్లా నాయక్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో టైం స్కేల్ ఉద్యోగి మృతి



నివాళి అర్పిస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి



రామ్మోహన్ నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31: ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ కంప్యూటర్స్ ల్యాబ్ టైం స్కేల్ ఉద్యోగి రామ్మోహన్ నాయుడు (49) అనారోగ్యంతో మృతి చెందారు. చంద్రగిరి మండలం కొటాల గ్రామంలో బుధవారం రామ్మోహన్ నాయుడు భౌతిక కాయానికి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. 20 ఏళ్లకు పైగా యూనివర్సిటీలో పనిచేసిన రామ్మోహన్‌నాయుడుకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ టైం స్కేల్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎర్రసాని సుబ్రమణ్యంరెడ్డి, మధుసూదన్ నాయుడు, సోమేశ్వరరావు, తిరుపాల్ రెడ్డి, జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, ప్రశాంత్‌బాబు, బాలాజీ పాల్గొన్నారు.

## మిట్టపాలెంలో 'గడప గడపకు'

చంద్రగిరి, జనవరి 31: చంద్రగిరి మండలం మిట్టపాలెం పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: నూతన కలెక్టర్ లక్ష్మీశాను ఎస్పీ పరమేశ్వరరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇరువురూ జిల్లా పరిస్థితులపై చర్చించారు. జిల్లాలో పోలీసింగ్ గురించి ఎస్పీ కలెక్టర్‌కు వివరించారు.

## ఆర్టీసీలో 15మంది ఉద్యోగ విరమణ

తిరుపతి (కొర్లగుంట), జనవరి 31: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ సుదీర్ఘ కాలం తర్వాత మొదలైంది. జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంతో పాటు 11డిపోల పరిధిలో 15మంది ఉద్యోగులు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ చెంగల్రాయలు, సీనియర్ అసిస్టెంట్ మాధవయ్య, తిరుపతి డిపో డ్రైవర్ గోవిందయ్య, కండక్టర్లు ఎ.జె.నాయుడు, ఎస్.టి.రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం డి.రామచంద్రనాయుడు పాల్గొని వారి సేవలను కొనియాడి, జ్ఞాపికలతో సత్కరించారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు



ధనుష్ - వైజయంతిమాల

తిరుమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో యదుగిరి యతిరాజ మఠాధిపతి యతిరాజ నారాయణ రామానుజ జీయర్, సీనియర్ సినీ నటి వైజయంతిమాల, నటుడు ధనుష్, ఎమ్మెల్సీ రామారావు, తెలంగాణ ఎమ్మెల్యే వినోద్, మాజీ కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

### శ్రీవారి ఆశీస్సులు అందుకున్న నూతన కలెక్టర్

తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన లక్ష్మీ శా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు.

## శ్వేత డైరెక్టర్‌గా మళ్లీ భూమన్



తిరుపతి (కల్చరల్), జనవరి 31: టీటీడీ శ్వేత డైరెక్టర్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సోదరుడు భూమన సుబ్రమణ్యంరెడ్డికి రెండోసారి అవకాశం దక్కింది. ఈ మేరకు టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల పూర్వ అధ్యాపకుడు అయిన భూమన్ రాయలసీమ ఉద్యమనేతగా ప్రసిద్ధుడు. ఈయన 2007లో కూడా శ్వేత డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుత తాత్కాలిక డైరెక్టర్ ఏ.ప్రశాంతి నుంచి భూమన్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారు. భూమన్‌ను డాక్టర్ శైలకుమార్, డాక్టర్ సాకం నాగరాజ, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

## ఆధ్యాత్మికత పెంపునకే ధార్మిక సదస్సు

### టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి

తిరుమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్తుల్లో ఆధ్యాత్మిక భావన పెంచేందుకే తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహిస్తామన్నామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. బుధవారం సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని మరింత వ్యాప్తి చేసేందుకు, మతాతీకరణకు అడ్డుకట్ట వేసేందుకు, చిన్నవయసు నుంచే పిల్లల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలతో మరిన్ని ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

## జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం





రోహిత్‌ని అభినందిస్తున్న డాక్టర్ తిప్పారెడ్డి


తిరుపతి (విద్య), జనవరి 31 : రేణిగుంట రోడ్డులోని అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాలలో 2016-21లో చదివిన (బీఏ, ఎల్ఎల్‌బీ) పూర్వ విద్యార్థి ఎం.రోహిత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో రోహిత్‌ని ప్రిన్సిపాల్ డాక్టర్ బిజయ్‌కుమార్ బెహ్రా, అధ్యాపకులతో కలసి ఆయన సన్మానించారు. తిప్పారెడ్డి మాట్లాడుతూ కోర్సు పూర్తిచేసి, న్యాయవాది వృత్తిని చేపట్టిన రోహిత్ 2023లో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో రాణించి జడ్జిగా ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తమ కళాశాలలో చదివిన ఎందరో పూర్వ విద్యార్థులు జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు ఆపాలి



తిరుపతి(ఆటోనగర్) జనవరి 31 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలపై అధిక భారం మోపుతోందని, వీటిని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. మూడు రోజులుగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మూడోరోజు బుధవారం తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. హాజరైన మురళి మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు రూ.1,387కోట్లు ఆదాయ లోటును చూపాయన్నారు. ఆ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పకుండా దొడ్డిదారిన వినియోగదారులపై భారం మోపేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని నియంత్రణ మండలి అనుమతించకూడదని కోరారు. గతంలోనూ ఇలా ఆర్థిక లోటు పూడ్చేందుకు ప్రజలపై భారం వేశారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. డిస్కంలకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్లను బకాయి పెట్టడం వల్ల అధిక వడ్డీకి రుణాలు తీసుకుని సంక్షోభంలో కూరుకుపోయాయని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి వేలకోట్ల రూపాయలు అదానీ గ్రూప్, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సహా ఇతర ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైందని, దీన్ని రెగ్యులేటరీ కమిషన్ అడ్డుకోవాలని కోరారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చట్టరీత్యా నేరమన్నారు. 2004 నుంచి 2019 వరకు వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సుమారు రూ.56,735కోట్లు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేయడం ఏమిటని మండిపడ్డారు. అలాగే ప్రతినెలా ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ఇందనపు చార్జీలు, అడిషనల్ లోడ్ చార్జీల రూపంలో భారం వేయడాన్ని కమిషన్ అనుమతించకూడదన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సంస్థలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ (టెక్నికల్) శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, అమరరాజా సంస్థ నుంచి డీజీఎం కే.కుమారస్వామి ఆన్‌లైన్‌లో హాజరై మాట్లాడుతూ సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న కేప్టివ్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా, వినియోగం తదితర అంశాలలో సాంకేతికపరంగా చార్జీలు నిర్ణయించే ఒప్పందాలను కమిషన్ మరోసారి పరిశీలించాలని కోరారు.

## ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం



తిరుపతి(కొర్లగుంట), జనవరి 31: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు బుధవారం తారకరామ మైదానంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి 14 బాలుర, బాలికల జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు.

## రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి నేరుగా తెలియజేయవచ్చు. దీనికోసం భక్తులు 0877-2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

## స్విమ్స్ పరిశోధక విద్యార్థినికి డాక్టరేట్



శిరీష

తిరుపతి సిటీ, జనవరి 31 : స్విమ్స్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన కొడవల శిరీషకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిరీష అలైడ్ సైన్సెస్ విభాగం కింద బయోటెక్నాలజీలో ఇన్ విట్రో జనరేషన్ ఆఫ్ కెరటినోసైట్స్ ఫ్రమ్ హ్యూమన్ హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్స్ అనే అంశంపై పరిశోధనలు నిర్వహించారు. బయోటెక్నాలజీ విభాగం చీఫ్ గైడ్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ పీ.వీ..జీ.కే.శర్మ పర్యవేక్షణలో ఆమె గ్రంథాన్ని సమర్పించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ తెలిపారు. శిరీషను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డీన్ అల్లాడి మోహన్, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి అభినందించారు.

## గంగమ్మగుడి పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (కల్చరల్), జనవరి 31 : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నూతన పాలకమండలి నియామకానికి దేవాదాయ శాఖ ఉప కమిషనరు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తి కలిగినవారు దేవస్థానం కార్యాలయ పనివేళల్లో దరఖాస్తు పొందవచ్చునని ఈవో మమత తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీలోగా ఆలయ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 31: ఆర్టీసీ క్లాస్ టూ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ డైరీని బుధవారం ఉదయం ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఉద్యోగులకు ఉపయోగపడేలా డైరీని ముద్రించారని అభినందించారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ పీవో డి.రామచంద్రనాయుడు, అసిస్టెంట్ మేనేజర్లు టి.ఎం.చంద్ర, మహేంద్ర, నిర్మల, కళ, పద్మావతి,రాజశేఖర్,ఎంఎఫ్‌వో ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి

తిరుపతి సిటీ, జనవరి 31 : ప్రజారోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు అన్నారు. భారత ప్రజారోగ్యంపై తిరుపతిలో ఆగస్టులో మూడు రోజులపాటు నిర్వహించే కాన్ఫరెన్స్‌కు సంబంధించి మొదటి ప్రచార బ్రోచర్‌ను ఆయన ఎస్వీ వైద్య కళాశాలలో సామాజిక వైద్య విభాగం అధికారులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా వస్తున్న అంతుపట్టలేని వ్యాధులకు ఇలాంటి కాన్ఫరెన్స్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు అప్పలనాయుడు, సునీత, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



బహుళ అంతస్తుల భవనాలకు వేస్తున్న పునాదులు



# ఇవేం ఆటలు బాస్?

### ఎస్వీ హైస్కూల్ క్రీడా మైదానంలో భారీ నిర్మాణం - ఆవేదనలో పేద విద్యార్థులు

తిరుపతి, ఆంధ్రజ్యోతి

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని ఓవైపు వైసీపీ ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు తిరుపతిలో క్రీడా మైదానాలను కాంక్రీట్ జంగిల్స్‌గా మార్చేస్తూ పేద విద్యార్థుల ఆటలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఒకప్పుడు ఏ స్కూల్లో చూసినా కనిపించే క్రీడామైదానాలు రానురాను కుచించుకుపోయాయి. మిగిలిన ఆట స్థలాల్లోనూ నిర్మాణాలు చేపట్టేసి విద్యార్థులను నాలుగుగోడలకే పరిమితం చేసేస్తున్నారు. తిరుపతిలో టీటీడీ దూకుడుతో విద్యాప్రమాణాలు మాట ఎలా ఉన్నా.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే ఆటలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చదువుతోపాటు ఆటలున్నప్పుడే పిల్లలు మానసికంగా, ఆరోగ్యంగా ఎదుగుతారని క్రీడా వేదికలపై ప్రసంగాలు చేసే నేతలే.. ఆట స్థలాన్ని కాపాడమని వేడుకుంటున్నా ముఖం చాటేస్తున్నారు.





దశలవారీగా కనుమరుగు

ప్రకాశం రోడ్డులో వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఎస్వీ హైస్కూల్ మైదానం క్రమక్రమంగా కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతోంది. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం తిరుమల నిర్వాసితుల కోసమని రోడ్డుకు ఒకవైపు ప్రవేశద్వారం పెట్టి ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. నిర్వాసితుల కోసం చెప్పడంతో అప్పట్లో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఎస్వీ హైస్కూల్‌తోపాటు మహతి దగ్గర ఉండే మరో స్కూల్, కోర్టు ఎదుట ఉండే కోదండరామ హైస్కూల్ విద్యార్థులకు ఇక్కడి ఆటస్థలమే క్రీడాధామంగా ఉండేది. ఇక్కడ ఎక్కువగా పేద విద్యార్థులే ఉంటారు.



టీటీడీ ఉద్యోగుల కోసం..

దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆటస్థలంలో ఫుట్‌బాల్, హాకీ వంటి ఆటలను పలువురు కోచ్‌లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పేదవిద్యార్థులకు శిక్షణ ఇస్తుంటారు. ఇక్కడ సుశిక్షితులైన క్రీడాకారులు.. రాష్ట్రస్థాయి పోటీల వరకు వెళ్లారు. టీటీడీకి ఎక్కడా స్థలమే లేదన్నట్టుగా ఆట స్థలాన్ని క్రమంగా కుదిస్తూ వచ్చేసింది. టీటీడీ ఉద్యోగులు మాత్రమే వినియోగించేలా ఇక్కడ కొంతమేర కంచె వేసేశారు. ఉన్నదాంట్లో ప్రస్తుతం బహుళ అంతస్తుల భవనాలకు పునాదులు వేస్తున్నారు.



ప్రవేశ ద్వారం వద్ద షాపింగ్ కాంప్లెక్స్

### హాస్టల్ కోసమని..

శ్రీవేంకటేశ్వ సంగీత, నృత్యకళాశాల విద్యార్థుల హాస్టల్ బ్లాక్ కోసమని రూ.11కోట్ల నిధులతో 20/60 మీటర్ల విస్తీర్ణంతో మూడంతస్తుల నిర్మాణం కోసం పనులు మొదలుపెట్టారు. క్రీడా మైదానంలో నిర్మాణ పనులు ఆపాలని పూర్వ విద్యార్థులు, పలువురు క్రీడాకారులు ఇటీవల టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని కలిసి విన్నవించారు. కానీ ఆయన నుంచి సానుకూల స్పందన రాలేదు. టీటీడీ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు క్రీడా మైదానం కనుమరుగు కాబోతుండడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. అధికార పెద్దలను గట్టిగా నిలదీయలేక లోలోపలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎస్వీ మ్యూజిక్ కాలేజీలోనే హాస్టల్ నిర్మించే వెసులుబాటు ఉందని, ఇప్పటికైనా టీటీడీ పునరాలోచించి విద్యార్థుల క్రీడలకు ఊపిరిపోయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

# క్రీడా మైదానాన్ని కాపాడండి

### ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలను చెరపకండి

### క్రీడాభిమానుల వేడుకోలు

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఎస్వీ హైస్కూల్‌కు చెందిన క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలు నిలుపుదల చేయాలని పలువురు క్రీడాభిమానులు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం రోడ్డులోని ఆటస్థలంలో టీటీడీ బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ బుధవారం మైదానానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి, వారిని లోపలకు వెళ్లనీయకుండా గేట్లు వేసేశారు. దీంతో గేటు బయటే నిరసనకు దిగారు. 'ప్లే గ్రౌండ్‌లో భవనాలు వద్దు-ఆటలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ నగరానికి ఒక ఐకాన్‌గా ఉండేదని, అలాంటి దాన్ని నాశనం చేయవద్దని కోరారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ డైనమస్ క్లబ్ ద్వారా ఎంతోమంది ఆటగాళ్లు ఇదే స్థలం నుంచి వచ్చారని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేశారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు వేదికగా నిలిచిన క్రీడా ప్రాంగణాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చకుండా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గుంతలు తవ్వేసిన ఆటస్థలం చూసి ఆవేదన కలుగుతోందన్నారు. పార్టీలకతీతంగా ఉద్యమిస్తామన్నారు. జెన్ కిరణ్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ కనుమరుగైపోతోందని ఆవేదన చెందుతున్నామన్నారు. నాటి ఫుట్‌బాల్ క్రీడాకారుడు మునెయ్య, రెడ్డెప్ప, పిలిప్స్ మాట్లాడుతూ ఇక్కడ జరిగే ఆటల పోటీలను చూసేందుకు టికెట్లు కొనుగోలు చేసి వచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం క్రీడా మైదానం చూసినప్పుడల్లా మనసులో తెలియని బాధ కలుగుతోందన్నారు.





మైదానం గేట్ల వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు, క్రీడాభిమానులు

## సమతా స్వప్నాన్ని సాకారం చేసిన యోధుడు లెనిన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 : ఒక వ్యక్తిని మరో వ్యక్తి, ఒక జాతిని మరో జాతి, ఒక దేశాన్ని మరో దేశం పీడించే సాంఘిక ధర్మం ఇక చెల్లదనే సమతా స్వప్నాన్ని సాకారం చేసిన యోధుడు లెనిన్ అని ప్రముఖ సామాజిక విశ్లేషకులు ఎన్.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ - అభ్యుదయ వేదిక సంయుక్తంగా ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన లెనిన్ శత వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాదుల నియంత్రణ కోసం ప్రపంచానికి లెనిన్ ఆలోచనలు అవసరమని అభిప్రాయపడ్డారు. 54 ఏళ్లు నిండకుండానే మరణించినా 35 ఏళ్లకు మించి పీడితవర్గ విముక్తి కోసం లెనిన్ పనిచేశారని తెలిపారు. అనేక అవరోధాల మధ్య, వ్యతిరేక శక్తుల సవాళ్లను ఎదుర్కొంటూ నిలిచి పోరాడారని చెప్పారు. నాయకత్వం వహించిన పోరాటం, అనుభవించిన నిర్బంధం, స్థాపించిన కార్మిక రాజ్యం, సందర్భానికి తగినట్టు వ్యూహాలను మార్చిన చాతుర్యం ఆయన సొంతమన్నారు. సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో లెనిన్ ఆలోచనల అవసరం పెరిగిందన్నారు. విశాలాంధ్ర జనరల్ మేనేజరు హరినాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమ్మె హక్కును ప్రభుత్వం కాలరాసిందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు ప్రధాని మోదీ కుట్ర చేశారని విమర్శించారు. అభ్యుదయ వేదిక జిల్లా కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమంలో అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కడియాల వెంకటరమణ, ప్రొఫెసర్ రాజశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వేణుగోపాల్

## టీటీడీ డిగ్రీ కళాశాలలకు ప్రిన్సిపాళ్ల నియామకం

### పద్మావతికి నారాయణమ్మ, ఆర్ట్స్ కాలేజీకి వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 31: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు డిగ్రీ కళాశాలలకు ప్రిన్సిపాల్స్‌ని నియమిస్తూ బుధవారం విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహదేవమ్మ ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ నారాయణమ్మను బదిలీపై నియమించారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని బదిలీపై ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించగా..ఎస్వీఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు సత్యనారాయణను కొత్తగా ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పాఠశాల అభివృద్ధిలో దొరస్వామయ్య కృషి ఎనలేనిది

తిరుపతి(విద్య), జనవరి31 :సింగాలగుంట నగరపాలక ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో హెచ్‌ఎం పసల దొరస్వామయ్య కృషి ఎనలేనిదని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో దొరస్వామయ్య ఉద్యోగ విరమణ సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డీఈవో మాట్లాడుతూ పూరిగుడిసెలో ఏడుగురు విద్యార్థులతో ఉన్న పాఠశాలను ఆయన హయాంలో ఆ సంఖ్యను 180కి పెంచడంతోపాటు సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది విద్యాభివృద్ధికి కృషి చేశారని అభినందించారు. గౌరవ అతిథిగా వచ్చిన మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం, విద్యార్థుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఎంఈవోలు బాలాజీ, భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దొరస్వామయ్య చేసిన సేవలకు గుర్తింపుగా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డుతో పాటు పలు సంస్థల అవార్డులను అందుకున్నారని గుర్తుచేశారు. కార్పొరేటర్ పి.నరేంద్రనాథ్, ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, రంగనాథయ్య, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధారాణి, ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనంజయులనాయుడు, భీమినేని మునికృష్ణనాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణ, రమేష్‌నాయక్, జగన్నాథం, కార్పొరేషన్ అధికారులు చిట్టిబాబు, రవి, సీపీఐ నాయకులు రామానాయుడు, విశ్వనాథం, టీచర్లు ప్రమీల, రమాదేవి, సౌందర్య, కుష్బు, లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ రాజారెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.



దొరస్వామయ్య దంపతులను సన్మానిస్తున్న డీఈవో, మాజీ ఎమ్మెల్సీ



ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందితో ఎస్పీ

## విలువైన సేవలందించారు..

● పోలీసు సిబ్బంది వీడ్కోలు సభలో ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: 'అతికష్టమైన పోలీసు ఉద్యోగాన్ని ఎన్నో ఏళ్లు చేశారు... విలువైన సేవలు అందించారు... విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించండి' అని ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సూచించారు. జిల్లాలో బుధవారం 21 మంది పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ చేశారు. నగరంలోని ఓ సభా ప్రాంగణంలో వీరికి సన్మానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీసు శాఖకు ఎన్నో విజయాలు అందించి, ఆదర్శంగా నిలిచారని అన్నారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, విమలకుమారి, డీఎస్పీలు నరసప్ప, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## పద్మావతి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సన్మానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31: పద్మావతి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మహదేవమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కాలేజీ అభివృద్ధికి ఆమె చేసిన కృషిని అధ్యాపకులు, విద్యార్థులు కొనియాడారు. టీటీడీ విద్యా సలహాదారు డాక్టర్ ఎల్ఆర్ మోహన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ హుస్సేన్, డీన్ అప్పారావు, రిటైర్డు ప్రిన్సిపాల్ శ్రీరాములు, రిటైర్డు లెక్చరర్ ప్రేమావతి, బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథరెడ్డి, మిమిక్రీ విజయకుమార్ తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.




## సైకత శుభాకాంక్షలు

సినీ నటుడు బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ గ్రామ సమీపంలోని సముద్రతీర ప్రాంతంలో బ్రహ్మానందం సైకత శిల్పాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు.

\- చిల్లకూరు

## టీడీపీతోనే సామాజిక న్యాయం: నెలవల



సదస్సులో మాట్లాడుతున్న నెలవల

ఓజిలి, జనవరి 31: ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించి బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకువస్తే... చంద్రబాబునాయుడు సామాజిక, ఆర్థికాభివృద్ధిలో నడిపించాడని సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెవల సుబ్రహ్మణ్యం అన్నారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు బుధవారం ఓజిలిలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బడుగులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసిందని విమర్శించారు. టీడీపీ బీసీలకు పెద్దపీట వేసిందని వారిని అన్ని విధాలా ఆదుకుందని, కార్పొరేషను ఏర్పాటుతో పాటు ఆదరణ వంటి పథకాలతో 90 శాతం రాయితీ కింద వివిధ పరికరాలు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. గడచిన నాలుగన్నరేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనతో తీవ్ర ఇబ్బందులు పడ్డ బీసీలు ఏకతాటిపైకి రావడం శుభపరిణామం అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, రాష్ట్ర కార్యదర్శి మల్లి మునుస్వామి, మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంకాయల వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్కే ఖలీల్, సుధీర్, సతీష్‌చంద్ర, కార్తీక్‌రాజు, పురుషోత్తంరాజు, సుబ్రహ్మణ్యంరాజు, చింతల సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన దుగరాజపట్నంవాసులతో సునీల్‌కుమార్

వాకాడు, జనవరి 31: మండలంలోని దుగరాజపట్నం పంచాయతీలోని అంజలాపురం, కొండూరుపాళెం, కాశీవాకం, పులింజరిపాళెం, దర్గామిట్ట గ్రామాలకు చెందిన 200 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. ఆవుల రాము, చంద్రకాంత్, జయరామయ్య, మీరయ్య, కొమ్మయ్య, బాబు ఆధ్వర్యంలో దుగరాజపట్నం మాజీ సర్పంచు దోసకాయల కృష్ణమూర్తి నాయకత్వంలో టీడీపీలో చేరారు. వారికి గూడూరు ఇన్‌చార్జి పాశిం సునీల్‌కుమార్ పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, తుమ్మల మోహన్‌నాయుడు, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, కోటా శ్రీనివాసులు, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, చిరంజీవమ్మ, తీపలపూడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**గూడూరు:** మండలంలోని తిరువెంగాలాయపల్లెకు చెందిన వంద కుటుంబాల వైసీపీ కార్యకర్తలు చేవూరు సురేంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికీ మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా కోట మండలంల కర్లపూడి గ్రామానికి చెందిన కొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, సర్వోత్తమరెడ్డి, జలీల్‌అహ్మద్, రాధాకృష్ణరెడ్డి, నాగేశ్వరరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోసమే డీఎస్సీ డ్రామా

### తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31: ఎన్నికలు సమీపిస్తున్నందునే వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ డ్రామాకు తెరలేపిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ గురించి పట్టించుకోని ప్రభుత్వం ఎన్నికలకు రెండు నెలల ముందు నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగులను ఊరిస్తోందన్నారు. రాష్ట్రంలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రం చెప్పగా, ప్రస్తుతం 6వేల పోస్టుల భర్తీ అని చెప్పడం దారుణమన్నారు. 2014-19 నడుమ రెండు మెగా డీఎస్సీలు నిర్వహించిన 16,790 మందికి ఉపాధ్యాయులుగా చంద్రబాబు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. వైసీపీ ఎన్నికల గిమ్మిక్కులను నిరుద్యోగులు ఓటు ద్వారా తిప్పి కొట్టాలని ఆనంద్‌గౌడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 61,135 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## టీడీపీతో అభివృద్ధి

గూడూరు, జనవరి 31: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక ఒకటో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేసేలా మినీ మెనిఫెస్టోను రూపొందించడం జరిగిందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, గోను శివకుమార్, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, సుప్రజ, సుధ, విజయమ్మ, గురవయ్య, లక్ష్మి, రేవతి జనార్దన రెడ్డి, ఆడపాల శివ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న సంధ్యారాణి





తవ్వకాలను అడ్డుకుంటున్న రోసనూరు గ్రామస్తులు, టీడీపీ నేత రాజేంద్ర - పోలీసులతో మాట్లాడుతున్న స్థానికులు

## ఆగని గ్రావెల్ దందా

- హైవే పనుల ముసుగులో లే అవుట్లకు తరలింపు
- అడ్డుకున్న రోసనూరు గ్రామస్తులు, టీడీపీ నేతలు
- ఫోన్‌లో ఎన్డీసీసీబీ చైర్మన్ బెదిరింపులు

పెళ్లకూరు, జనవరి 31: పెళ్లకూరు మండలంలో ఆగని గ్రావెల్ దందా అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములను యధేచ్ఛగా తవ్వేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల ముసుగులో రేయంబవళ్లు రియల్ ఎస్టేట్ భూములకు తరలిస్తున్నారు. తాజాగా మండలంలోని రోసనూరు ప్రాంతంలోని ప్రభుత్వ భూములను తవ్వి తరలిస్తుండడంతో స్థానికులు, నాయుడుపేటకు చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దార్ల రాజేంద్ర తదితరులు అడ్డుకున్నారు. వారిని వైసీపీ నేత ఫోన్లో బెదిరించిన ఘటన బుధవారం వెలుగుచూసింది. మండలంలోని శిరసనంబేడు, నందిమాల, చెన్నప్పనాయుడుపేట, బంగారంపేట తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల నుంచి నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం అంటూ వైసీపీలోని ఓ వర్గం నేతల కన్నుసన్నల్లో గ్రావెల్ తవ్వుతున్నారు. నాయుడుపేటలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ప్రతిరోజు వందలాది టిప్పర్లు తరలిస్తుండడంతో గ్రామస్తులంతా ఏకమై అడ్డుకోవడంతో ఆయా గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలను నిలిపివేశారు. మళ్లీ వారం రోజుల నుంచి వైసీపీలోని మరో వర్గం రోసనూరు పంచాయతీ పరిధిలోని భూముల్లో గ్రావెల్ తవ్వకాలను ప్రారంభించారు. దీంతో బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఓ గ్రామస్తుడికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న నాయుడుపేట సీఐ జగన్మోహన్‌రావు, పెళ్లకూరు ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి వివాదాలు లేకుండా సర్దుబాటు చేసినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య విభేదాలే ఈ వివాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

## బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం: కురుగొండ్ల



కుల వృత్తుల పరికరాలతో టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 31: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఆర్ఎల్ కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా దివంగత నేత ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని స్థాపించారని కొనియాడారు. ఆ మహనీయుడి బాటలోనే చంద్రబాబు నడుస్తున్నారని చెప్పారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బీసీలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేసి, తప్పుడు కేసులు పెట్టి గొంతు నొక్కేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు కులవృత్తులను ప్రోత్సహిస్తూ రాయితీలు కల్పించి బీసీల ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ గత ప్రభుత్వం అమలు చేసిన రాయితీలను ఎత్తివేసి బీసీల కడుపు కొట్టారని విమర్శించారు. చంద్రబాబుతోనే రామరాజ్యం సాధ్యమని, రానున్న ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు తోట కృష్ణయ్య, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గంగోటి నాగేశ్వరావు, డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మునిస్వామి, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, బీరం రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, సామల చలపతి, జానపాటి బాలకృష్ణ, రుద్రాక్ష కౌశల్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు ఆపాలి




ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్) జనవరి 31: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలపై అధిక భారం మోపుతోందని, వీటిని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. మూడు రోజులుగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మూడోరోజు బుధవారం తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. హాజరైన మురళి మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు రూ.1,387కోట్లు ఆదాయ లోటును చూపాయన్నారు. ఆ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పకుండా దొడ్డిదారిన వినియోగదారులపై భారం మోపేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని నియంత్రణ మండలి అనుమతించకూడదని కోరారు. గతంలోనూ ఇలా ఆర్థిక లోటు పూడ్చేందుకు ప్రజలపై భారం వేశారని గుర్తుచేశారు. నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. డిస్కంలకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్లను బకాయి పెట్టడం వల్ల అధిక వడ్డీకి రుణాలు తీసుకుని సంక్షోభంలో కూరుకుపోయాయని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి వేలకోట్ల రూపాయలు అదానీ గ్రూప్, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సహా ఇతర ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైందని, దీన్ని రెగ్యులేటరీ కమిషన్ అడ్డుకోవాలని కోరారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చట్టరీత్యా నేరమన్నారు. 2004 నుంచి 2019వరకు వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సుమారు రూ.56,735 కోట్లు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేయడం ఏమిటని మండిపడ్డారు. అలాగే ప్రతినెలా ఫిక్స్‌డ్, కస్టమర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ఇంధనపు చార్జీలు, అడిషనల్ లోడ్ చార్జీల రూపంలో భారం వేయడాన్ని కమిషన్ అనుమతించకూడదన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సంస్థలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ (టెక్నికల్) శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, అమరరాజా సంస్థ నుంచి డీజీఎం కే.కుమారస్వామి ఆన్‌లైన్‌లో హాజరై మాట్లాడుతూ సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న కేప్టివ్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా, వినియోగం తదితర అంశాలలో సాంకేతికపరంగా చార్జీలు నిర్ణయించే ఒప్పందాలను కమిషన్ మరోసారి పరిశీలించాలని కోరారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సయ్యద్‌సాహెబ్

### ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 31: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు బుధవారం తారకరామ మైదానంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి 14 బాలుర, బాలికల జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. ఇందులో విజయం సాధించిన జట్లు రాష్ట్రస్థాయికి ఎంపికవుతాయన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.ప్రవీణ్, శ్రీధర్ క్రీడాకారులను అభినందించారు. జిల్లాకు చెందిన ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులు సుజన్, కార్తీక్‌ను సన్మానించారు.

## ఉద్యోగులను నిరుత్సాహపరచిన కేబినెట్ నిర్ణయాలు

తిరుపతి(విద్య)జనవరి 31: ఏపీ కేబినెట్ సమావేశంలో బుధవారం చేపట్టిన నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర నిరుత్సాహానికి గురిచేశాయని సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రేగంటి దేవానంద్ వాపోయారు. ఎంతో ఆశగా ఎదురుచూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యంకాని నిర్ణయాలు తీసుకుని నిరాశపరచారని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన అరియర్స్, డీఏల ప్రస్తావనలేకపోవడం బాధించిందని, అలాగే 2003 టీచర్లకు కేంద్రప్రభుత్వ జీవో ప్రకారం పాతపెన్షన్ నిర్ణయం తీసుకుంటారని ఎదురుచూసిన 7వేలమంది టీచర్ల ఆశలు అడియాశలు అయ్యాయని విమర్శించారు. ఐఆర్ ప్రకటన లేకుండానే ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని డీఎస్సీ-2024, అటవీశాఖలో ఉద్యోగాల పోస్టులకు ఆమోదించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వర్సిటీలలో బోధనేతర ఉద్యోగులకు 60 నుంచి 62ఏళ్లకు పెంపు నిర్ణయం నిరుద్యోగుల అవకాశాలను గండి కొట్టడమే అవుతుందని ఆరోపించారు.

## జాతరలో దుకాణాల ఏర్పాటుకు వేలం

చిల్లకూరు, జనవరి 31: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 2నుంచి 5వ తేదీ వరకు ముత్యాలమ్మ జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయం చుట్టుపక్కల తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.10,30,000, దేవస్థానం ప్రాగణంలో పూలు, మాలలు విక్రయించుకునేందుకు రూ.55,000, పాదరక్షలు భద్రపరుచుకునేందుకు రూ.41,000, వేయికళ్ల కుండలు విక్రయించుకునేందుకు రూ.3,5,6000, అమ్మవారి ఫొటోలు, డాలర్లు, ధారాలు, తాయిత్తులు విక్రయించుకునేందుకు రూ.2,55,000కు హక్కులు దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, బాలాజీ, విమల, ప్రభాకర్, సిబ్బంది సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెడ్‌కానిస్టేబుల్ కరీమ్‌కు సత్కారం



కరీమ్, సలీమా దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

నాయుడుపేట, జనవరి 31: క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ షేక్ కరీమ్‌సాహెబ్ సేవలు అభినందనీయమని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ కరీమ్‌సాహెబ్ బుధవారం పదవీ విరమణ చేశారు. కరీమ్, సలీమా దంపతులను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలను కరీమ్ బృందం రికవరీ చేసిందన్నారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తరువాత కరీమ్ రెండు పర్యాయాలు ఉత్తమ అవార్డులు అందుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్కే షరీఫ్, ఎస్కే సిరాజ్, ఎస్కే నజీర్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతిలో అలహాబాద్‌కు చెందిన

## బస్సు డ్రైవర్ దారుణ హత్య

### క్లీనర్ నిరంజన్‌ను అనుమానిస్తున్న పోలీసులు



బస్సు డ్రైవర్ చంద్రసేన్ తివారి మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ తిరుపతిలో హత్యకు గురయ్యారు. బస్సు క్లీనర్ అదృశ్యం కావడంతో అతడే హత్యకు పాల్పడి వుంటాడని పోలీసులు భావిస్తున్నారు. అలహాబాద్‌కు చెందిన 55మంది యాత్రికులు తీర్థయాత్రకు తమ ప్రాంతానికే చెందిన ఓ ప్రైవేటు బస్సును అద్దెకు కుదుర్చుకున్నారు.చంద్రసేన్ తివారి (52) బస్సు డ్రైవర్ కాగా, నిరంజన్ క్లీనర్ (25). ఒడిశా రాష్ట్రంలో పర్యటన ముగించుకున్న యాత్రికులు మంగళవారం సాయంత్రానికి తిరుపతికి చేరుకున్నారు. యాత్రికులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లగా... పాత తిరుచానూరు రోడ్డులోని ప్రైవేటు బస్సుల పార్కింగ్ ప్రదేశంలో బస్సును పార్క్ చేసుకుని డ్రైవర్ చంద్రసేన్ తివారి, క్లీనర్ నిరంజన్ తిరుపతిలోనే ఉండిపోయారు. శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుంచి వచ్చిన యాత్రికులు చంద్రసేన్ తివారి హత్య విషయాన్ని గుర్తించారు. తల, ముఖంపై తీవ్రమైన గాయాలతో బస్సు సీటులో పడుకున్నవాడు పడుకున్నట్టే మృతిచెంది ఉండటాన్ని గుర్తించి స్థానికుల సాయంతో ఈస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.భక్తులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు, బస్సు యజమానికి సమాచారం తెలియజేశారు.క్లీనర్ నిరంజన్ కనిపించకపోగా అతడి సెల్‌ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ చేసి ఉండటంతో అతడే హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి తల, ముఖంపై ఉన్న బలమైన గాయాలను బట్టి జాకీరాడ్ లేదా మరేదైనా ఇనుప కడ్డీతో బలంగా కొట్టి హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లీనరే హత్య చేశాడా లేక మరెవరైనా చేశారా... హత్యకు కారణమేంటి అనే విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

## ధనపాల్‌కు సన్మానం



ధనపాల్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 31: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన ధనపాల్‌ను బుధవారం ఆ పార్టీ నాయకులు సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన పోతుగుంట విజయబాబు మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు కష్టించి పనిచేయాని దిశానిర్దేశం చేశారు. దళితులకు టీడీపీలో రాజకీయంగా ఎప్పుడూ ఉన్నత అవకాశాలను కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ధనపాల్ మాట్లాడుతూ దళితులను సంఘటితం చేసి నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి పెమ్మసాని సుమన్‌నాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఈ. రవినాయుడు, సూపర్‌బజార్ చైర్మన్ చంద్రాయాదవ్, టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ప్రకాష్ వంశీ, మాజీ కౌన్సిలర్ గోపి, మధుసూదన్‌రాజు, రమేష్, మణి, అయ్యప్ప, బాబు రాయల్, దాము రాయల్, పరంధామం పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## వీధి బాలలకూ హక్కులుంటాయి

పుత్తూరు అర్బన్, జనవరి 31: వీధి బాలలకు సైతం హక్కులు ఉంటాయని, వారి పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే శిక్షార్హులవుతారని న్యాయవాది సంజీవి అన్నారు. బుధవారం వీధిబాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు పట్టణంలోని స్వామీవీధిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యా హక్కు చట్టం, బాల్యవివాహ నిరోధక చట్టంపై అవగాహన కలిగించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో ఉంచుకుంటే యజమానిని కఠినంగా శిక్షిస్తారని హెచ్చరించారు. న్యాయవాది మురుగేషన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది సంజీవి

## టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు టోకరా: భానుప్రకాష్



ఎన్‌జీవో కాలనీలో సైకిల్‌పై ప్రచారం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 31: ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తూ... ఆ కుటుంబం మొత్తం ఆత్మగౌరవంతో జీవనం సాగించాలనే మహోన్నత లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు నిధులు కేటాయించి నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం టోకరా ఇచ్చిందని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఎన్‌జీవో కాలనీ, మంచినీళ్ల బావి వీధిలో ఆ పార్టీ యూనిట్ ఇన్‌చార్జి ఎల్లంటి ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేనతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి కుందేలు గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను 90 శాతం మేర పూర్తి చేసినట్లు గుర్తుచేశారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేసేందుకు ఈ ప్రభుత్వానికి ఐదేళ్లు సరిపోలేదని దుయ్యబట్టారు. గత ఏడాది ఆగస్టులో మంత్రి రోజా టిడ్కో ఇళ్లను డిసెంబర్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తామని సెల్ఫీ వీడియో తీసి మరీ వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి రోజా అవినీతి సొమ్ముపైన చూపే శ్రద్ధలో కనీసం ఒక శాతమైనా ప్రజల సంక్షేమం కోసం దృష్టి పెట్టి ఉంటే నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోయి ఉండేదన్నారు. రెండుసార్లు గెలిపించినందుకు ఆమె కుటుంబం బాగుపడిందే తప్ప నియోజకవర్గ ప్రజలు సర్వనాశనమైపోయారని మంత్రి రోజాపై నిప్పులు చెరిగారు. పుత్తూరును అభివృద్ధి చేసింది తన తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడే అని పునరుద్ఘాటించారు. ప్రశాంతతకు మారుపేరైన పుత్తూరులో శాంతిభద్రతలు గతి తప్పాయని, రౌడీమూకలు చెలరేగిపోతున్నాయని, ప్రైవేట్ సెటిల్‌మెంట్లు ఎక్కువై పోయాయని, పోలీస్‌స్టేషన్లను వైసీపీ నాయకులు పోస్టాఫీసులుగా మార్చేశారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పుత్తూరులో శాంతి భద్రతలను మళ్లీ గాడిన పెడతామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. విజన్ ఉన్న నేత చంద్రబాబును ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టతనిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ ధనపాల్, జనసేన సమన్వయకర్త మహేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, సుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, దిలీప్, జయచంద్ర, వేలు, ఖాజాపీర్, జీవామురళి, యుగంధర్, కరుణాయాదవ్, ఉమాశంకర్, చిట్టి, అన్బు, అన్బు, ఈశ్వర్, తడుకు సర్పంచ్ బొబ్బిలియాదవ్, జి.బాబు, హమీద్ పాల్గొన్నారు.

## పల్లికొండేశ్వరాలయంలో ఫారెస్ట్ అధికారి



నాగలాపురం, జనవరి 31: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వర స్వామిని బుధవారం తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి నూకవరపు నాగేశ్వరరావు దర్శించుకున్నారు.ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కుల్ దర్శన ఏర్పాట్లు చేశారు. సబ్ డీఎఫ్వో శ్రీనివాసరావు ఆయన వెంట వున్నారు.

## మడిబాకలో సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు, జనవరి 31: ఏర్పేడు మండలం మడిబాక గ్రామంలో మునెమ్మ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం వారి కుటుంబాన్ని పరామర్శించి మునెమ్మ కుటుంబ సభ్యులకు 52 సరుకులతో కూడిన సిపాయి భరోసాను అందజేశారు.వైసీపీ నాయకులు చెంగల్‌రాజు, రవియాదవ్, మధుసూదనరాజు, సుధాకర్‌రాజు, మునిశేఖర్ నాయుడు, దామోదరరెడ్డి, మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా చాంద్‌బాషా



నాగలాపురం, జనవరి 31: సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా టీపీకోట గ్రామానికి చెందిన చాంద్‌బాషాను నియమించినట్లు పార్టీ ఇన్‌చార్జి హెలెన్ తెలిపారు.

## తెలుగురైతు నేతకు కన్నీటి వీడ్కోలు

రేణిగుంట, జనవరి 31: మండలంలోని గుత్తివారిపల్లికి చెందిన తెలుగు రైతు గ్రామకమిటీ అధ్యక్షుడు ఎస్.రమణమూర్తి రెడ్డి (62)మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు.టీడీపీ నాయకులతో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం ఉదయం గుత్తివారిపల్లికి చేరుకుని రమణమూర్తి మృతదేహానికి నివాళులర్పించారు.ఎన్టీఆర్ అభిమాని అయిన రమణమూర్తి పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించారన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పి.మునస్వామి నాయుడు, డి.పుష్పనాథ్, పి.చిన్నారెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, మహబూబ్ బాషా, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

## శ్వేత డైరెక్టర్‌గా మళ్లీ భూమన్



తిరుపతి (కల్చరల్), జనవరి 31: టీటీడీ శ్వేత డైరెక్టర్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సోదరుడు భూమన సుబ్రమణ్యంరెడ్డికి రెండోసారి అవకాశం దక్కింది. ఈమేరకు టీటీడీ జేఈవో వి. వీరబ్రహ్మం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల పూర్వ అధ్యాపకుడు అయిన భూమన్ రాయలసీమ ఉద్యమనేతగా ప్రసిద్ధుడు. ఈయన 2007లో కూడా శ్వేత డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుత తాత్కాలిక డైరెక్టర్ ఎ. ప్రశాంతి నుంచి భూమన్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారు. భూమన్‌ను డాక్టర్ శైలకుమార్, డాక్టర్ సాకం నాగరాజ, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళీతో పాటు పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

## 19మందికి ఉద్యోగ అవకాశం

శ్రీకాళహస్తి, జనవరి 31: ఉద్యోగమేళాలో 19 మందికి నియామకం లభించింది. శ్రీకాళహస్తి పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం పలు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. ప్రిన్సిపాల్ శ్రీలత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సాగు భూములకు హద్దులు చూపండి

శ్రీకాళహస్తి, జనవరి 31: మూడు దశాబ్దాలుగా దళిత రైతులు సాగు చేసుకుంటున్న భూములకు హద్దులు చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండలం వాగువేడు సచివాలయం వద్ద బుధవారం తమ సమస్యలు పరిష్కరించాలంటూ దళిత రైతులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ... వాగువేడు దళితులు మూడు దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ కనీసం అధికారులు హద్దులు చూపకపోవడం బాధాకరమన్నారు. కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా స్పందించకపోవడం శోచనీయమన్నారు.

## రిటైర్డ్ టీచర్లకు సత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 31: వృత్తిపట్ల నిబద్ధతతో సేవలందించే ఉద్యోగులకు సర్వత్రా గౌరవం లభిస్తుందని శ్రీకాళహస్తి ఎంఈవో భువనేశ్వరి అన్నారు. వేడాం ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రధానోపాధ్యాయుడు గురునాథం, తెలుగు ఉపాధ్యాయుడు గోపి పదవీ విరమణ సన్మానసభకు ఆమె విచ్చేశారు. గురునాథం, గోపిలను ఘనంగా సత్కరించారు.ఎంఈవోలు బాలయ్య, నాగేశ్వర్రావు, లక్ష్మీపతి, సీఆర్‌ఎంటీలు హేమలత, మునిమోహన్, స్వప్న, శాంతి, దేవిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత న్యాయసేవలపై అవగాహన పెరగాలి



ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి, జనవరి 31: రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సేవలపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఉపకారాగారం లో 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ ఆదేశాల మేరకు న్యాయమూర్తి బేబీ రాణి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా జైల్లో పారిశుధ్య నిర్వహణ, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఉచిత న్యాయ సేవలపై రిమాండ్ ఖైదీలకు అవగాహన కల్పించారు.

## సేవ కోసమే హెల్పింగ్ హాండ్స్



ఉచిత బజార్ నిర్వహిస్తున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు

శ్రీకాళహస్తి, జనవరి 31: హెల్పింగ్ హాండ్స్ సంస్థ నిర్వాహకులు మునీర్ బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని చెంచులక్ష్మి గిరిజన కాలనీలో ఉచిత బజార్ నిర్వహించారు. దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు, కొట్టేసాయి, ఢిల్లీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే అభివృద్ధి

శ్రీకాళహస్తి, జనవరి 31: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు.శ్రీకాళహస్తి మండలంలోని కాపుగున్నేరి, చెర్లోపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, నాయకులు కామేష్ యాదవ్, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏడు గంగమ్మల ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



పూజలు చేస్తున్న పండితులు

శ్రీకాళహస్తి, జనవరి 31: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఏడు గంగమ్మల ఆలయంలో వాస్తు పూజ వేదోక్తంగా జరిగింది. బుధవారం ఏడు గంగమ్మల ఆలయ పునర్నిర్మాణానికి ముక్కంటి ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం బాలాలయ స్థాపన నిర్వహించనున్నారు. ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు,డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూకరత్నం, ఏఈ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 31: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈవో మునిసుబ్రమణ్యం సూచించారు.బుచ్చినాయుడుకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన బుధవారం మధ్యాహ్న భోజనం తిని ఇంకా క్వాలిటీ పెంచాలన్నారు. పాఠశాల ప్రదానోపాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు.

## తీరిన తాగునీటి సమస్య

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 31: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో పైపులైన్ మరమ్మతులతో తాగునీటి సమస్య తీరింది. బుచ్చినాయుడుకండ్రిగ నుంచి ఈబీసీ కాలనీకి పైపులైను ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ఈబీసీ కాలనీ దగ్గర పైపులైనుకు లోపల భాగం చెట్ల వేర్లు ఇరుక్కుపోయి నాలుగు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడ్డారు.సర్పంచ్ వెంకటమ్మ, కార్యదర్శి ఇందిరమ్మ బుధవారం పైపులైను బయటకు తీయించి కొత్త పైపులైను ఏర్పాటు చేసి తాగునీటిని అందించారు.

## విద్యుత్ కార్మికులపై దాడికేసులో ఐదుగురి అరెస్టు

రేణిగుంట, జనవరి31: స్థానిక పాత చెక్‌పోస్టు వద్ద రెండురోజుల క్రితం విద్యుత్ కార్మికులపై దాడికి పాల్పడిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.సోమవారం రాత్రి విద్యుత్ కార్మికులపై దాడిచేసి పరారైన ఎ.దిలీప్, ఎస్.సెల్వం, టి.చిన్నరాజు, ఆర్.చంద్రశేఖర్, జి.మనోజ్‌కుమార్ బుధవారం ఉదయం సంతగేటు సమీపంలోని సినిమాథియేటర్ వద్ద వుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

# విజ్ఞానగిరికి దారేదీ..?

● అడ్డదిడ్డంగా ఆక్రమణలతో భక్తులకు అవస్థలు

శ్రీకాళహస్తి, జనవరి 31: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన విజ్ఞానగిరికి దారేదంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. అడ్డదిడ్డంగా ఆక్రమణలు పెరిగిపోవడంతో ఆ మార్గం మూసుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డులో విజ్ఞానగిరి ఉంది. కొండపైన సుబ్రహ్మణ్య స్వామి కొలువై ఉన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఆలయంలో పూజలు జరుగుతుంటాయి. దీన్ని కుమార స్వామి తిప్ప ప్రాంతంగా పిలుస్తుంటారు. విజ్ఞానగిరికి రెండువైపుల నుంచి మెట్ల మార్గాలున్నాయి. కొండకు పడమటి వైపు వినాయకస్వామి వద్ద నుంచి మొదటి మార్గం ఉంది. అలాగే రెండో మార్గం ఆర్టీసీ బస్టాండు రోడ్డులోని మిట్ట ప్రాంతం నుంచి ఉంది. మొదటి మార్గంలో మెట్లు అధికం. రెండోమార్గం అయిన మిట్ట వైపు నుంచి మెట్లు తక్కువ సంఖ్యలో ఉంటాయి. యేటా ఆడికృత్తిక సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రెండు మెట్ల మార్గాలు భక్తులతో రద్దీగానే ఉంటాయి. ఇక ప్రతి మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేక క్రతువులు నిర్వహిస్తుంటారు. అలాగే ప్రతి మాస కృత్తిక, సుబ్రహ్మణ్య షష్టి లాంటి ప్రత్యేక రోజుల్లో విశేష పూజలు, అభిషేకాలు జరుగుతుంటాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయం, పైగా విజ్ఞానగిరి అన్న ప్రాచుర్యం ఉండడంతో పట్టణం నుంచే కాకుండా పరిసర గ్రామాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. ఆర్టీసీ బస్టాండు వైపు నుంచి మిట్ట మార్గం సులభ మార్గం కావడం.. అలాగే గ్రామాల నుంచి, పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎంతో అనువుగా ఉంటుంది. ఈ క్రమంలో మిట్ట వైపు నుంచి మెట్లమార్గంలో మహిళలు పెదసంఖ్యలో కొండపైకి రాకపోకలు సాగిస్తుంటారు. కొంతకాలం నుంచి ఈ మార్గం మొదట్లో ఆక్రమణలు పెరిగిపోయాయి.దీంతో రోజురోజుకూ మార్గం కుంచించుకుపోతోంది.ఆక్రమణల మధ్యలో మహిళలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మగవారు అడ్డదిడ్డంగా నిలబడిపోవడంతో వారి మధ్య నుంచి వెళ్లేందుకు మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ విశేష పూజలు తెలుసుకుని కొత్తగా కొండవద్దకు చేరుకునే వారికి చేదు అనుభవం తప్పడం లేదు.మిట్ట ప్రాంతం వద్ద కొత్త వారు కొండపైకి దారి అడిగినా చూపడంలేదు.మరో వైపు నుంచి వెళ్లాల్సిందిగా సలహాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని ఎవరైనా ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగుతున్నారు. సరిగ్గా మిట్ట ప్రాంతం వద్ద ఆర్టీసీ బస్టాండు రోడ్డు ఉంది. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. పైగా ఇరుకు ప్రదేశం కూడా.రోజురోజుకూ ఆక్రమణలు పెరుగుతుండడంతో మిట్టప్రాంతం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోతోంది. మిట్ట ప్రాంతం వద్ద ట్రాఫిక్ స్తంభించడం వల్ల అటు పాతబస్టాండు, పెద్ద మసీదు వీధి కూడలి, ఇటు అంబేడ్కర్ కూడలి వరకు వాహనాలు స్తంభించిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి విజ్ఞానగిరి దారిలో ఆక్రమణలు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



ఆక్రమణలతో మూసుకుపోయిన విజ్ఞానగిరి మెట్ల మార్గం

# అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

శ్రీకాళహస్తి, జనవరి 31: అనుమానాస్పద స్థితిలో జాస్మిన్(23) అనే గర్భవతి మృతి చెందిన ఘటన బుధవారం శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లి షేక్ షకీరా కథనం మేరకు... ఇసుగుంట గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ బీ కుమారుడు షోహీల్(24) చిల్లర దుకాణం నిర్వహిస్తుంటారు. అదే గ్రామానికి చెందిన అక్బర్ బాషా, షకీరా దంపతుల కుమార్తె జాస్మిన్‌కు మూడేళ్ల క్రితం షోహీల్‌తో వివాహం చేశారు. వీరికి ఏడాదిన్నర వయసున్న కొడుకున్నాడు. ప్రస్తుతం జాస్మిన్ ఆరు నెలల గర్భవతి. రెండేళ్లుగా జాస్మిన్,షోహీల్ మధ్య కలహాలు మొదలై తరచూ గొడవలు జరిగేవి.జాస్మిన్‌ను తల్లిదండ్రులు బుజ్జగించి తిరిగి కాపురానికి పంపేవారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జాస్మిన్ బిడ్డకు తీవ్ర జ్వరం వచ్చింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లే విషయంలో మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. ఉదయం 9 గంటల సమయంలో జాస్మిన్ ఉరివేసుకుని మృతి చెందినట్లు ఆమె భర్త అందరికీ సమాచారం ఇచ్చాడు. మృతురాలి తల్లిదండ్రులతో పాటు బంధువులు అక్కడికి చేరుకున్నారు.అందరూ అనుమానాలు వ్యక్తం చేస్తూ నిలదీయడంతో తాను కూడా చనిపోతానంటూ అక్కడి నుంచి అదృశమయ్యాడు. గర్భవతి అయిన తమ బిడ్డను పొట్టన పెట్టుకున్నారంటూ భోరున విలపిస్తూ జాస్మిన్ తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు.జాస్మిన్ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు తమ బిడ్డ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో షోహీల్ తల్లిని అదుపులోకి తీసుకున్నారు. వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.



జాస్మిన్ మృతదేహం - జాస్మిన్ పాత చిత్రం

# శ్రీ-కాళ-హస్తి శోభకు కసరత్తు

శ్రీకాళహస్తి జనవరి 31: పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాశస్త్యం ప్రకాశించేలా విద్యుత్ దీపాలంకరణ చేయబోతున్నట్లు ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ఇందుకోసం చతుర్మాడ వీధుల్లో బుధవారం ఆలయ అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ...సాలెపురుగు, పాము, ఏనుగు పేరుతో శ్రీకాళహస్తి క్షేత్రం ఆవిర్భవించిన విషయం తెలిసిందేనన్నారు.ఆ మూడు మూగజీవాలతో పాటు నందీశ్వరుని కలిపి మాడ వీధుల్లో వినూత్నంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో వీధిలో ఒక్కో ప్రతిమతో విద్యుత్ కాంతులతో స్తంభాలను శోభాయమానంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రూ.1.80 కోట్లతో వచ్చే నెల 9వ తేదీన భూమి పూజతో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, ఈఈ నూక రత్నం, ఏఈ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చతుర్మాడ వీధుల్లో కొలతలు వేస్తున్న ముక్కంటి ఆలయ అధికారులు

## అంతిమ సంస్కారంలో రగడ

శ్రీకాళహస్తి, జనవరి 31: బంధువు మృతదేహానికి అంతిమ సంస్కారం నిర్వహించే క్రమంలో రెండు కుటుంబాల మధ్య రగడ చేటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలం అబాబాట్లపల్లిలో బుధవారం మల్లయ్య మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య అంతిమ సంస్కారం నిర్వహించే విషయమై వాగ్వాదం జరిగింది. వివాదం ముదిరి పరస్పరం కర్రలతో దాడులకు దిగారు. ఇందులో భాగంగా మురళి, అయన సతీమణి సావిత్రి, వెంకటేశ్వర్లు, అయన భార్య శ్వేత గాయపడి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరారు.శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ముక్కంటి ఆలయ ఈవోగా నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, జనవరి31:ఎన్టీఆర్ జిల్లా డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావును శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా నియమించారు.విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవో రామారావు అదనపు బాధ్యతగా ముక్కంటి ఆలయ ఇంచార్జి ఈవోగా సుమారు రెండు నెలలు పాటు కొనసాగారు. మొత్తంగా 21 నెలల తర్వాత ముక్కంటి ఆలయానికి రెగ్యులర్ ఈవోను నియమించడం గమనార్హం.

## ఈవో రామారావుకు పితృవియోగం

శ్రీకాళహస్తి, జనవరి 31: ముక్కంటి ఆలయ ఈవో రామారావు తండ్రి సత్యనారాయణ శివైక్యం చెందారు. శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్ పార్కు ఎదురుగా ఉన్న ఈవో రామారావు స్వగృహంలో ఆయన బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు.

## వైసీపీ ప్రభుత్వ అభివృద్ధి ఎక్కడ: జనసేన

తొట్టంబేడు, జనవరి 31: వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎక్కడ అని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇంచార్జి కోట వినుత ప్రశ్నించారు.తొట్టంబేడు మండలంలోని కాసరం పంచాయతీలో జనసేన విజయ యాత్ర..ఏపి నీడ్స్ పవన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.తొట్టంబేడు మండల ఇంచార్జి పేట చంద్రశేఖర్, నాయకులు ప్రదీప్‌కుమార్, కావలి శివకుమార్, గణేష్, రవికుమార్‌రెడ్డి, దండిరాఘవయ్య, లక్ష్మి, శారద చిరంజీవి, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎన్నికల ప్రచారం

తొట్టంబేడు, జనవరి 31: ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి బుధవారం తొట్టంబేడు మండలంలోని కొమ్మనగుంట, గాజుచేను గ్రామాల్లో ముందస్తు ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎంపీపీ ఉన్నం నిర్మల, మండల వైసీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

## ఎంఈవో తనిఖీలు

వరదయ్యపాళెం, జనవరి 31: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీలోని మండల పరిషత్ పాఠశాలను బుధవారం ఎంఈవో సరస్వతి తనిఖీ చేశారు. వసతుల గురించి ఆరా తీశారు. బోధన ఎలా జరుగుతోందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం పిల్లలకు కాసేపు పాఠాలు బోధించారు.ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు.

## సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

### టీడీపీ ఇన్‌చార్జి హెలెన్

సత్యవేడు, జనవరి 31: టీడీపీ అధినేత చంద్రబాబుపై వేసిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీం కోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ పేర్కొన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అధికార గర్వంతో జగన్ అండ్ కో పెట్టిన కేసులు తప్పు అని సుప్రీం కోర్టు తీర్పుతో వెల్లడైందని స్పష్టం చేశారు.సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలతో ఇప్పటికైనా జగన్, వైసీపీ నాయకులు సిగ్గు పడాలని కోరారు. వైసీపీపై అసంతృప్తితోనే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతున్నారని ఆమె తెలిపారు. తనకు కేటాయించిన తిరుపతి పార్లమెంట్ సీటును సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తిరస్కరించారని, నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, మచిలీ పట్నం ఎంపీ బాలశౌరి, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వైసీపీకి రాజీనామా చేశారని గుర్తు చేశారు.

## డీఎస్సీపై ప్రభుత్వ డ్రామా : టీఎన్ఎస్ఎఫ్



సత్యవేడు, జనవరి 31: అధికారంలోకి వచ్చి ఐదేళ్ళవుతున్నా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సమీపించడంతో టెట్, డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామంటూ డ్రామాలాడుతోందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 60 నెలలు అధికారం వెలగబెట్టిన జగన్ చివరి 60 రోజుల్లో 6 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ అని హడావుడి చేస్తే జనం నమ్మబోరని ఎద్దేవా చేశారు. త్వరలో డ్రామాల వైసీపీ ప్రభుత్వం పోతుందని యువతకు ఉద్యోగాలు ఇచ్చే దమ్మున్న టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తుందని తెలిపారు.

## వైసీపీ అనుబంధ కమిటీల్లో చోటు

సత్యవేడు, జనవరి 31: వైసీపీ అనుబంధ విభాగాల జిల్లా కమిటీల్లో సత్యవేడు మండలానికి చెందిన పలువురికి చోటు లభించింది. యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇరుగుళంకు చెందిన శ్రీధర్‌రెడ్డి, మహిళా విభాగ ప్రధాన కార్యదర్శిగా సత్యవేడుకు చెందిన మస్తానమ్మను నియమించారు.

## కూలీ పేరున 16 విద్యుత్ మీటర్లు

● సంక్షేమ పథకాలకు అనర్హుడిగా తేల్చేశారు



కొట్టపాటి గోపి

వరదయ్యపాళెం, జనవరి 31: నిరుపేద గిరిజన కూలీ పేరుపై 16 విద్యుత్ మీటర్లు ఉన్నాయని చెప్పి సంక్షేమ పథకాలకు అనర్హుడిగా తేల్చేశారు.వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీకి చెందిన కొట్టపాటి గోపి తనకు పింఛను మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందిని అడిగాడు. దరఖాస్తును పరిశీలించిన సిబ్బంది అతడి పేరుపై 16 విద్యుత్ మీటర్లున్నట్లు చెప్పడంతో హతాశుడయ్యాడు. దాదాపు 35 సంవత్సరాల కింద ఎన్టీఆర్ హయాంలో నిర్మించి శిథిలావస్థకు చేరిన ఇంట్లో నివాసం ఉంటున్న తన పేరుతో ఇన్ని విద్యుత్ మీటర్లు ఎలా నమోదయ్యాయో అర్థం కాక వాపోతున్నాడు.అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాడు.

## తహసీల్దారుకు పదోన్నతి



వరదయ్యపాళెం, జనవరి 31: వరదయ్యపాళెం తహసీల్దారు గౌరీశంకర్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై అనంతపురం బదిలీ అయ్యారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ లక్ష్మీదేవి

సత్యవేడు, జనవరి 31: సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులతో వరి, వేరుశనగ సాగులో అధిక దిగుబడులు పొందవచ్చని తిరుపతి రైతు వనరుల కేంద్రం ఏడీ లక్ష్మీదేవి తెలిపారు.సత్యవేడు మండలంలోని మదనంబేడు రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.లక్ష్మీదేవికి ఈ సందర్భంగా పలువురు రైతులు వరి గిట్టుబాటు ధర ఉన్నా కూడా ఆశించిన దిగుబడులు రాలేదని విన్నవించుకున్నారు. దీనికి ఆమె సమాధానమిస్తూ పంట వెన్ను దశలో తుఫాను రావడం వలన అలాగే తెల్ల చీడ వలన దిగుబడులు తగ్గాయని తెలిపారు.దిలీప్ సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించి సూక్ష్మపోషక యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.ఏవోలు శ్రీనివాస్, మురళి, వీహెచ్‌ఏ మురళి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తీరుపై నిరసన

నాగలాపురం, జనవరి 31: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వైసీపీ తీరుపై పిచ్చాటూరు వైసీపీ నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల వైసీపీ కన్వీనర్ హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

## ఆధార్ కేంద్రాలు ప్రారంభించండి

కేవీబీపురం, జనవరి 31 :కేవీబీపురం మండలంలో ఆధార్ కేంద్రం లేక జనం ఇబ్బంది పడుతున్నారు. గతంలో మీ సేవ కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని సచివాలయానికి తరలించారు. సచివాలయ ఆపరేటర్ బదిలీపై వెళ్లడంతో అది కాస్తా మూత పడింది. గతంలో మిద్దికండ్రిగ, రాజులకండ్రిగ, కేవీబీపురం గ్రామాల్లో ఆధార్ కేంద్రాలకు కావాల్సిన యంత్రాలు వచ్చాయి.సిబ్బందినీ నియమించారు.అయినప్పటికీ కార్యలయాలను ఎందుకు ప్రారంభించడం లేదో జనానికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆధార్ కార్డుకు సంబంధించి ఏది కావాలన్నా పిచ్చాటూరు లేదా శ్రీకాళహస్తి మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి.అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.